# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 06 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- మేయర్, కమిషనర్‌తో కలిసి మంత్రి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్‌లో గణేష్ నిమజ్జన ప్రక్రియ అంగరంగ వైభవంగా జరిగేలా అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హుస్సేన్ సాగర్ క్రేన్ 4, 5 పాయింట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బలమురి వెంకట్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ.. కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖలతోపాటు అన్ని విభాగాలు వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు కషి చేస్తున్నాయని చెప్పారు. గణేష్ ఉత్సవ సమితులతో సమన్వయం చేస్తూ మహా నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఇప్పటి వరకూ గ్రేటర్

మిగితా 2వ పేజీలో



## మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ యువ రాష్ట్రం వేగంగా పరుగులు తీస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం ప్రసంగించారు. యువ

రాష్ట్రం ప్రపంచంతో పోటీపడుతుందని, రాష్ట్ర అభివృద్ధికి ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని డిప్యూటీ సీఎం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ఎవరు ఊహించని రీతిలో పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర నిర్మాణానికి ఉపయోగపడుతుందని ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా భావిస్తుందని వివరించారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్టు వివరించారు. విద్యార్థులు కళాశాల బయటికి వెళ్లగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ ఎలా ఉండాలి అనేది పారిశ్రామికవేత్తలతో మాట్లాడి డిజైన్ చేసినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చాకలి ఐలమ్మ పేరిట మహిళా యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా వంటి దిగ్గజాన్ని చైర్మన్‌గా నియమించి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని ఐఎస్‌బీ నిర్వాహకులు స్కిల్ యూనివర్సిటీని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను సందర్శించి వాటికి అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం కోరారు. అవి ప్రారంభ దశలో ఉన్నందున ఇప్పుడు ఐఎస్‌బీ నుంచి సూచనలు అందితే, రాష్ట్ర భవిష్యత్‌కు ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఐఎస్‌బీ విద్యార్థులు గొప్ప అదష్టవంతులని, ఒక్కో తరగతి గది రూ.1.50 కోట్ల నుంచి రూ.రెండు కోట్ల వరకు వెచ్చించి నిర్మించారన్నారు. తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకున్నానని, రాసుకునేందుకు పలకలు కూడా లేకపోవడంతో గురువులు ఇసుకపైనే అక్షరాలు దిద్దించిన సందర్భాన్ని డిప్యూటీ సీఎం గుర్తుచేసుకున్నారు. గురుపూజ దినోత్సవం రోజు ఐఎస్‌బీ వంటి గొప్ప విద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. విద్య అనేది కేవలం ప్రొఫెషనల్స్ తయారు చేయడమే కాకుండా, సమాజం కోసం, మానవత్వం కోసం నాయకులను తీర్చిదిద్దాలన్నది తమ ప్రజా ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఈ సెంటర్ భవిష్యత్ తరాలకు దిక్సూచిగా ఉండాలని ఆకాంక్షించారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత కాంపస్ ఫ్యూచర్ సిటీలో ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మోతిలాల్ ఓస్వాల్ డీన్ మదన్ పిల్లుట్ల, ప్రభాత్ సిన్హా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బాగా పనిచేస్తే
# మళ్లీ మాదే అధికారం

- పేదల తలరాతను మార్చేది చదువొక్కటే
- విద్యను వ్యాపారంగా మార్చిన బీఆర్ఎస్
- కేజీ టు పీజీ అమలైందా?
- విదేశాల్లో అధ్యయనం కోసం ఏటా 200 మంది టీచర్లను పంపుతాం
- పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేలా కొత్త విద్యావిధానం
- సీఎం రేవంత్‌రెడ్డి
- ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానోత్సవంలో



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉపాధ్యాయులు సమర్థవంతంగా పనిచేస్తే, మళ్లీ తామే అధికారంలోకి వస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దుదామని అందరం ప్రతిజ్ఞ చేద్దామని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రతి పేదవాడూ ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమని, అందరం కలిసి వారికి నాణ్యమైన విద్యను అందిద్దామని కోరారు. "విద్యా రంగం అభివృద్ధి కోసం తెలంగాణలో ఏటా 40 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఈ పిల్లలే దేశ భవిష్యత్తు. వారి భవిష్యత్తు ఉపాధ్యాయులైన మీ చేతుల్లో ఉంది. రాష్ట్రంలో 1 లక్షా 20 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో ప్రైవేటు స్కూళ్లకంటే నాణ్యమైన విద్యను అందించడానికి అందరం నడుం బిగిద్దాం" అని అన్నారు. బలమైన తెలంగాణను నిర్మించాలంటే దేశ భవిష్యత్తు గరగతి గదుల్లో ఉందని బలంగా విశ్వసిస్తానని చెప్పారు. గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థినీ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి స్టాల్స్ అన్నింటినీ పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

"ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు రాణించాలి. ప్రైవేటు స్కూళ్లలో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ మూడేళ్లు చదివిన తర్వాత పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు రావడం లేదు. అందుకే విద్యా కమిషన్ సూచనల మేరకు ప్రభుత్వ బడుల్లో కూడా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభిస్తున్నాం. ఈ ఏడాది 3 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి వచ్చారంటే ఉపాధ్యాయుల కృషి మాత్రమే. అందుకు టీచర్లందరినీ అభినందిస్తున్నా. పిల్లలు బడికి పోవడానికి రవాణా సౌకర్యం లేకపోతే స్కూల్ టీచర్లు వారి జీతంలో కొంత కేటాయించి సామాజిక బాధ్యతగా ఆ డబ్బుతో పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు. ఆదిలాబాద్ జిల్లాలో ఉపాధ్యాయులైన భార్య, భర్తలిద్దరూ కలిసి ఆదివాసీ పిల్లలకు చదువు చెబుతున్న తీరు అభినందనీయం.

## రెవెన్యూ శాఖ మీద పడిన
## అవినీతి ముద్రను తొలగించాలి

- ఆ బాధ్యత కొత్తగా నియమితులైన గ్రామ పరిపాలన అధికారులదే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జీపీవోలకు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో



## మహా గణపతిని దర్శించుకున్న సీఎం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఖైరతాబాద్ శ్రీ విశ్వశాంతి మహా గణపతి మహదేవుడిని దర్శించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుడి కృప ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించారు. హైదరాబాద్ నగర చరిత్రలో గడిచిన 71 సంవత్సరాలుగా ఎన్ని ఇబ్బందులు, కష్టాలొచ్చినా దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవాలను జరుపుతున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ఒకసారి చేయడమే కష్టమవుతున్న ఈ కాలంలో ఎన్ని ఉపద్రవాలొచ్చినా తట్టుకుని నిలబడి నిర్వహిస్తున్న ఖైరతాబాద్ గణపతికి పోటీ లేదన్నారు. హైదరాబాద్‌లో 1 లక్షా 40 వేల విగ్రహాలను ప్రతిష్టించుకుని ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. భక్తుల మనోభావాలను గౌరవించే విధంగా నగరంలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖలు తోడ్పాటును అందిస్తున్నాయని చెప్పారు. అన్ని మతాలను గౌరవిస్తూ హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్యాంక్‌బండ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, ప్రజలంతా భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆరు నెలల్లో ఉప ఎన్నికలు




- బాన్సువాడలో పోచారం ఓటమి ఖాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో రాబోయే ఆరు నెలల్లో ఉప ఎన్నికలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓటమి ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. పోచారం ఎమ్మెల్యే పదవి పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, వందలాది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణను బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు ఇచ్చామని కానీ వారు సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఏ పనీ చేయలేకపోతున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని కేటీఆర్ దుయ్యబట్టారు. అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.80 లక్షల కోట్ల అప్పులు మాత్రమే చేసిందని, ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం కేవలం 21 నెలల్లోనే రూ.2.20 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసిందని తెలిపారు. నెలకు రూ.20 వేల కోట్ల అప్పులు చేస్తూ కూడా ఏ సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. యూరియా సంక్షోభంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం అనుమానాస్పదంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతుల కోసం కావలసిన ఎరువులు ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తోందని, రైతు ప్రయోజనాలపై కాంగ్రెస్ దుర్మార్గపు ఆలోచనలతో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరిలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచులు పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కో–ఆప్షన్ హకీమ్ తదితరులు ఉన్నారు.

## వినాయక నిమజ్జనం.. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వినాయక నిమజ్జనం సందర్భంగా ఈ నెల 6వ తేదీ ఉదయం 6 గంటల నుండి 7వ తేదీ ఉదయం 10 గంటల వరకు నగరంలో భారీ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. ఊరేగింపులు సాఫీగా సాగేందుకు పోలీసులు కఠిన నియంత్రణలు అమలు చేస్తున్నారు.

బాలపూర్ కట్టా మైసమ్మ దేవాలయం నుండి గుర్రం చెరువు, కేశవగిరి, చంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, మదీనా, అఫ్జల్‌గంజ్, బషీర్‌బాగ్, లిబర్టీ, అంబేద్కర్ విగ్రహం మీదుగా ఎన్‌టీఆర్ మార్గ్, పివిఎన్ఆర్ మార్గ్ (నెక్లెస్ రోడ్)కు చేరుకుంటుంది.

సికింద్రాబాద్ నుండి సంగీత్ థియేటర్, ప్యాట్నీ, ప్యారడైజ్, రాణిగంజ్, కర్బలా మైదాన్, ట్యాంక్ బండ్ మీదుగా ఎన్‌టీఆర్ మార్గ్ చేరుతుంది.

చిలకలగూడ నుండి గాంధీ హాస్పిటల్, ఆర్టీసీ ఎక్స్ రోడ్డు, నారాయణగూడ, హిమాయత్ నగర్ మీదుగా లిబర్టీ వద్ద ప్రధాన ఊరేగింపులో కలుస్తుంది.

ఉప్పల్ వైపు నుండి రామాంతపూర్, శ్రీ రమణ జంక్షన్, ఓయూ, విద్యానగర్ మీదుగా

మిగితా 2వ పేజీలో

## చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చత్తీస్‌గఢ్ రాష్ట్రం, నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోలు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఎదురుకాల్పుల్లో గాయపడిన పలువురు మావోలు తప్పించుకున్నట్లు పోలీసు బలగాలు చెబుతున్నాయి. తప్పించుకున్న వారి కోసం బలగాలు గాలింపు చర్యలు చేపట్టారు.. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో పోలీసులు భారీగా మందుగుండు సామగ్రితో పాటు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

## భార్యకు ఎక్కువ ఆస్తులుంటే భర్త భరణం ఇవ్వక్కర్లేదు

- మద్రాసు హైకోర్టు

**బలగం టీవీ, చెన్నై**



భార్యకు భర్తకన్నా అధికంగా ఆస్తులు, ఆదాయం ఉంటే భర్త ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని మద్రాసు హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఓ కేసులో భార్యకు నెలకు రూ.30 వేల భరణం చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది.

చెన్నైకి చెందిన వైద్య దంపతుల మధ్య విభేదాలు తలెత్తడంతో ఇద్దరూ విడాకుల కోసం ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. వారికి ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ కుమారుడు ఉన్నాడు. ఈ కేసు విచారణలో ఫ్యామిలీ కోర్టు భర్త తన భార్యకు నెలకు రూ.30 వేల భరణం చెల్లించాలని ఆదేశించింది. అయితే, ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ భర్త హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. భార్యకు అధికంగా ఆస్తులు, ఆదాయం ఉన్నట్లు, ఆమె స్వంతంగా స్కానింగ్ సెంటర్ నడుపుతున్నట్లు భర్త సమర్పించిన సాక్ష్యాలను పరిశీలించింది. కాబట్టి భర్త నుంచి భరణం కోరడానికి భార్యకు హక్కు లేదని కోర్టు స్పష్టం చేసింది. అయితే, కుమారుడు నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న దృష్ట్యా, అతడి చదువు ఖర్చులకు (రూ.2.77 లక్షలు) భర్త అంగీకరించారని కోర్టు రికార్డులో నమోదు చేసింది.

## రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు దెబ్బ తీయొద్దు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవీ, లండన్**



రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు దెబ్బ తినే విధంగా రాజకీయాలు చేయకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనిపై దృష్టి పెట్టకుండా గూగుల్ ప్రచారంపై దృష్టి పెట్టడం దురదృష్టకరమని విమర్శించారు. లండన్ పర్యటనలో భాగంగా జరిగిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. హరీశ్‌రావు మాట్లాడుతూ, "కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అనేక అద్భుతాలు సాధించింది. ఒకప్పుడు 'బెంగాల్ ఆచరిస్తుంది – దేశం అనుసరిస్తుంది' అనేవారు. కానీ ఇప్పుడు 'తెలంగాణ ఆచరిస్తుంది – దేశం అనుసరిస్తుంది' స్థాయికి వచ్చాం" అని పేర్కొన్నారు.

గత 10 ఏండ్లలో తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రగామిగా ఉంది. తలసరి విద్యుత్ వినియోగంలో కూడా దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. జీఎస్‌డీపీ గ్రోత్‌లో తెలంగాణకు దరిదాపులో కూడా ఏ రాష్ట్రం లేదు. నల్లా ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని కేసీఆర్ అందించారు. మ్యానిఫెస్టోలో పెట్టుకోకపోయినా ఇంటింటికీ తాగునీరు అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్. అసెంబ్లీలో వచ్చే ఎన్నికల నాటికి ప్రతి ఇంటికి నల్ల ద్వార నీళ్లియ్యకపోతే ఓట్లు అడుగను అని చెప్పిన గొప్ప నాయకుడు. మిషన్ భగీరథ కార్యక్రమంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించి చూపించారు.

తెలంగాణ రాకముందు హైదరాబాద్‌లో పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ఇచ్చేవారు. 4 గంటలకు కరెంటు కట్టు ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో 6 గంటల నుంచి 8 గంటల పవర్ కట్ ఉండేది. 60 ఏండ్లలో కాని పనిని కేసీఆర్ ఒక్క సంవత్సరంలో సాధించి 24 గంటల నాణ్యమైన కరెంటును అందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేసీఆర్ ప్రతీ ఉదయం విద్యుత్‌పై సమీక్ష చేసి, పవర్ కొనుగోలు టైమ్స్‌ని చూసేవారు. తర్వాత మిషన్ భగీరథ ప్రోగ్రెస్ చూసేవారు. అంకితభావంతో పనిచేసేవారు. అందుకే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది.

మిగితా 2వ పేజీలో

## మంత్రి ఉత్తమ్‌తో డెన్మార్క్ రాయబారి భేటీ

- రెండు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలపై చర్చ
- తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్ శుక్రవారం రోజున రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య, పారిశ్రామిక రంగంలో రెండు దేశాల మధ్య మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో అభివద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటనీ, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అన్ని రకాలుగా అనుకూల వాతావరణం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్లోబల్‌సిటీగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్ నగరంతోపాటు తెలంగాణా రాష్ట్ర విశిష్టతను మంత్రి ఉత్తమ్ ఆయనకు వివరించారు. ఐటీ రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరంలో ఇక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆధునిక వసతులు, ఫార్మా రంగంలో పురోగతిని ఆయన వివరించారు. ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పారిశ్రామిక వేత్తలు తరలి వస్తున్నారనీ, డెన్మార్క్ లాంటి దేశం కుడా ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## రైతు వేదికల వద్ద
## అదనపు యూరియా కౌంటర్లు

క్యూ నివారణకు ముందుగానే రైతులకు టోకెన్లు

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

వివరాలు 2వ పేజీలో

### ఉపాధ్యాయులు బాగా పనిచేస్తే

# మళ్లీ మాదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

అభినందనీయం.

రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా ఆదరించి, అవకాశం ఇచ్చినందున విద్యా శాఖ నా వద్ద పెట్టుకుని తక్షణమే మీ బదిలీలు, ప్రమోషన్లు వంటి సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాం. కొంత ఆలస్యం జరిగి ఉండొచ్చు. కానీ వీలైనంత మేరకు అన్ని సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం. తెలంగాణ వస్తే కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య అంటే తెలంగాణ బాగుపడుతుందని అందరూ భావించారు. కానీ అందుకు విరుద్ధంగా సింగిల్ టీచర్ పాఠశాలలు ఎన్ని మూత పడ్డాయో ఉపాధ్యాయులకు తెలుసు. ఉపాధ్యాయుల సమస్యలేవీ పరిష్కారం కాలేదు. ప్రజా ప్రభుత్వం వచ్చాక 15 ఏళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్స్ కల్పించాం. బదిలీలు చేపట్టాం. కేవలం 55 రోజుల్లో టెట్ నిర్వహణతో సహా కేవలం 55 రోజుల్లో డీఎస్సీ నిర్వహించి 11 వేల మందికి టీచర్ ఉద్యోగాలిచ్చాం. అవగాహనతో కూడిన బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. విద్యార్థినీ విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచాం. ప్రైవేటు యూనివర్సిటీలు పెట్టుకుని విద్యపై ఆదిపత్యం చెలాయించాలన్న ప్రయత్నాలు జరిగాయి. వర్సిటీల్లో నియామకాలు ఆగిపోయాయి. ఇంటర్మీడియట్ విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, ఉపాధ్యాయులు రిటైరైపోతుంటే కొత్త నియామకాలు చేపట్టలేదు. దేశానికి గొప్ప మేధావులను అందించిన ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి.

తెలంగాణలో గతంలో గురుపూజోత్సవ కార్యక్రమాలు ఎప్పుడైనా జరిగాయా. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర, వారి సేవల అవసరం ఉంటుందని మీతో మాట్లాడటానికి సమయం కేటాయించా. నేనూ గ్రామీణ పాఠశాలలోనే చదువుకున్నా. మీలాంటి వారు చదువు చెబితేనే ఈ స్థాయికి ఎదిగా. రాష్ట్రంలో 25 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే వాటిల్లో 24 లక్షల మంది విద్యార్థులున్నారు. 11 వేల ప్రైవేటు స్కూల్స్ ఉంటే వాటిల్లో 34 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. అందుకు కారణం పాలకులుగా మేము లేదా ఉపాధ్యాయులుగా మీరు. ప్రైవేటు స్కూళ్లను అవమానించడం కాదు. పోల్చి చెబుతున్నా. ప్రైవేటుకన్నా ప్రభుత్వ టీచర్లకు ఉన్నత విద్యార్హతలతో పాటు సామాజిక బాధ్యత గుర్తెరిగిన వారుంటారు.చదువు ఒక్కటే పేదల తలరాత మార్చుతుందని బలంగా నమ్ముతా. కొన్ని సంస్థల్లో అక్కడక్కడ ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు బాధ కలిగిస్తుంది. డైట్ చార్జీలను పెంచాం. నాణ్యమైన ఆహారం ఇవ్వాలని చెప్పాం. ఉపాధ్యాయులు కూడా వారితో కలిసి భోజనం చేయాలి. తల్లిదండ్రులు మనపై ఎంతో విశ్వాసంతో బడులకు పంపిస్తుంటారు. వారి నమ్మకమంతా టీచర్లపైనే. మీరెప్పుడైతే పిల్లలతో కలిసి భోజనం చేస్తారో తప్పులు జరక్కుండా ఉంటుంది.

ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన సింగపూర్, చైనా, జపాన్, జర్మనీ లాంటి దేశాల్లో జరుగుతున్న విద్యా విధానం అధ్యయనం కోసం ప్రతి ఏటా 2 వందల మంది ఉపాధ్యాయులను ఆయా దేశాలకు పంపించాలని నిర్ణయించాం. రాష్ట్రంలో 1 లక్షా 20 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా నైపుణ్యం పెంచుకోవలసిన అవసరం ఉంది.ఫౌండేషన్ సరిగా లేకుండా భవనానికి పై అంతస్తులు కట్టాలని భావించడం సరికాదు. అందుకే నర్సరీ నుంచి 12 తరగతి వరకు విద్యా రంగంలో గట్టి ఫౌండేషన్ ఉండాలని భావిస్తున్నాం. నైపుణ్యం లేకుండా కేవలం సర్టిఫికేట్లతో సరిపోదు. రాష్ట్రంలో ప్రతి ఏటా 1.10 లక్షల విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నారు. స్కిల్స్ లేని కారణంగా చాలామంది వెనుకబడి పోతున్నారు.అలాంటి విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో వంద నియోజకవర్గాల్లో 20 వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రపంచంలోనే అత్యున్నత ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నాం. అలాగే నైపుణ్యత కోసం మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా చైర్మన్ గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంబించాం.

రాష్ట్రంలోని 65 ప్రభుత్వ ఐటీఐల్లో పాత సిలబస్‌తో అవి కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితులొస్తే టాటా కన్సల్టెన్సీ వారి సహకారంతో 2400 కోట్ల రూపాయలు వెచ్చించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏటీసీలు గా మార్చుతున్నాం. ప్రపంచంలోని అత్యధిక జనాభా కలిగిన దేశం ఒలింపిక్స్‌లో ఒక్క మెడల్ కూడా సాధించలేకపోవడం మనకు అవమానకరం. దేశ ప్రతిష్ట పెరగడానికి తెలంగాణలో స్పోర్ట్ వర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఉండాలని నిర్ణయించాం. మీ స్కూళ్లల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించండి. వారిలోని ప్రతిభను వెలికితీయడానికి పిల్లలను నిశితంగా గమనించండి. అందుకు ఏది అడిగినా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కొందరు పిల్లలు మాదక ద్రవ్యాల వ్యసనాల బారిన పడుతున్నారు. తద్వారా జీవితంలో దారి తప్పుతున్నారు. అలాంటి వారిని చూస్తే తల్లిదండ్రులు ఎంత వ్యథ చెందుతారో అర్థం చేసుకోండి. రాష్ట్రంలో ఒక చిన్న గంజాయి మొక్క కనబడినా కఠినంగా చర్యలు తీసుకుంటాం…" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, సలహాదారులు కేశవరావు గారు, వేం నరేందర్ రెడ్డి గారు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, ఆయా విశ్వవిద్యాలయాల వైస్ చాన్సెలర్లు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతు వేదికల వద్ద అదనపు యూరియా కౌంటర్లు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో


రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా కౌంటర్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతుల క్యూ నివారణకు ముందుగానే వారికి టోకెన్లు ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం సత్ఫలితాలిస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కో-ఆపరేటివ్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పోలీసు, విజిలెన్స్ విభాగాలతో కూడిన పర్యవేక్షణ వలన ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజుల్లో రోజుకు కనీసం 10 వేల మెట్రిక్ టన్నుల చొప్పున రెండు లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయాలని గురువారం ఢిల్లీలో క్యాబినెట్ సెక్రటరీని కోరామని తెలిపారు. అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలనీ, అధిక మొత్తంలో నిల్వ చేసుకోవద్దని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

### రెవెన్యూ శాఖ మీద పడిన

# అవినీతి ముద్రను తొలగించాలి

- ఆ బాధ్యత కొత్తగా నియమి తులైన గ్రామ పరిపాలన అధికారులదే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- జీపీవోలకు నియామక పత్రాల అందజేతలో సీఎం రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్



అవినీతికి పాల్పడుతారని సమాజం ముందు దోషిగా రెవెన్యూ శాఖ మీద పడిన ముద్రను తొలగించుకునే బాధ్యత కొత్తగా నియమితులైన గ్రామ పరిపాలన అధికారులపై ఉందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. పరిపాలన చేయలేరని, అవినీతికి పాల్పడుతారంటూ మీపై జరిగిన ప్రచారం తప్పు.. అని నిరూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడా ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా పని చేయాలని చెప్పారు.

రెవెన్యూ శాఖలో కొత్తగా ఎంపికైన 5,106 మంది గ్రామ పాలనాధికారులు లకు హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో కొలువుల పండుగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా లాంఛనంగా నియామక పత్రాలను అందించారు.

ఈ సందర్భంగా ఉద్యోగాల్లో నియమితులైన జీపీఓలు అందరితో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి "భూ సంబంధిత విధి నిర్వహణలో పారదర్శకతతో నిబద్ధతతో న్యాయబద్ధంగా పని చేస్తానని" ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కొత్తగా నియమితులైన మీ పట్ల నాకు సంపూర్ణమైన విశ్వాసం ఉంది. తెలంగాణలో ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి రావడంలో భాగస్వాములైన మీరు, ఇప్పుడు ఏ చిన్న తప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డ పేరొస్తుంది. భూభారతిని అమలు చేయడమే కాకుండా సాదా బైనామా సక్రమంగా అమలు చేస్తారని హామీ ఇచ్చాం.పేదవాడికి న్యాయం జరగాలంటే గ్రామ పాలనాధికారులు అందుబాటులో ఉండాలని, అందుకు గాను 5 వేల పైచిలుకు గ్రామ పాలనాధికారులను నియమించాం. సాదా బైనామాకు సంబంధించి ఎనిమిది, తొమ్మిది లక్షల దరఖాస్తులు వచ్చాయని చెబుతున్నారు. జాగ్రత్తగా పరిష్కరించాలి. ఇది ఉద్యోగం కాదు. మీ ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య. ఇదొక భావోద్వేగం.

తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయులు, ఆర్టీసీ, సింగరేణి, రెవెన్యూ సిబ్బంది అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల సిబ్బందిని దొంగలుగా, దోషులుగా నిలబెట్టే ప్రయత్నం జరిగింది. తెలంగాణలో భూములకు సంబంధించి ఎన్నో సమస్యలున్నాయి. ఆ సమస్యలు పరిష్కరించడానికి వీలులేకుండా వీఆర్ఏ, వీఆర్వో, ఎంఆర్వోల నుంచి అధికారాలను తప్పించారు. తద్వారా సమాధానం చెప్పలేక మీరు సమాజంలో దోషులుగా నిలబడే పరిస్థితి కల్పించారు. ఎవరో కొందరు తప్పు చేశారని మొత్తం వ్యవస్థనే రద్దు చేస్తారా.

ఆనాడు ఎవరిని కదిలించినా ఈ ధరణి అనే ఒక భూతం పట్టి పీడించిందని చెప్పారు. అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో విసిరేసి కొత్త చట్టాలను తెచ్చాం. ధరణి అనే మహమ్మారిని అంతం చేయడానికి నిపుణులతో ఒక కమిటీని వేశాం. భూభారతి చట్టం చేసి 4 కోట్ల తెలంగాణ ప్రజలకు అంకితం చేశాం.ధరణి అనే వైరస్‌ను తప్పించడానికి అనేక రకాల సమాలోచనలు చేశాం. ఎంతమంది సలహాలు, సూచనలు తీసుకున్నాం. రాష్ట్రంలోని 1 లక్షా 56 వేల ఎకరాల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేయడమే కాకుండా గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం.

భూమికి తెలంగాణ ప్రజలకు విడదీయరాని అనుబంధం. భూమిపై జరిగిన ఏ పోరాటమైనా భూమి చుట్టే సాగాయి. నిజాంలను, రజాకార్లను, పెత్తందార్లను దిగంతాలకు తరిమికొట్టి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఎన్నో పోరాటాలు జరిగిన చరిత్ర ఉంది. వీటితో పాటు భూదాన్ ఉద్యమాలు కూడా వచ్చాయి.ఇందిరాగాంధీ గారిని ఒప్పించి ఆనాడు పీవీ నరసింహారావు గారు ల్యాండ్ సీలింగ్ చట్టం తీసుకొచ్చి 25 లక్షల ఎకరాల భూములను దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు పంపిణీ చేశారు. 10 లక్షల ఎకరాల పోడు భూములపై ఆదివాసీలకు పట్టాలను ఇవ్వడం జరిగింది.తెలంగాణలో మనిషికి భూమితో ఉన్న సంబంధం తల్లికీ బిడ్డకు ఉన్న సంబంధం. తెలంగాణ ఉద్యమం నుంచి మొదలు 2023 నాటి వరకు చరిత్రను పరిశీలిస్తే భూములను చెరబట్టిన వారిని ప్రజలు దిగంతాల వరకు తరిమికొట్టిన చరిత్ర ఉంది…" అని అన్నారు. అనంతరం పలువురికి నియామక పత్రాలను ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా అందించారు.ఈ కొలువుల పండుగ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, మంత్రి ధనసరి అనసూయ సీతక్క గారు, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి గారు, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి గారు, షబ్బీర్ అలీ గారు, హర్కర వేణుగోపాల రావు గారు, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ గారు, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ గారితో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలో 1.50 లక్షల విగ్రహాలు విజయవంతంగా నిమజ్జనం చేశారన్నారు. హుస్సేన్ సాగర్ చుట్టూ సజావుగా నిమజ్జనం జరిగేలా ఒక బాహుబలి క్రేన్‌తో సహా మొత్తం 40 క్రేన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. గణేష్ ఉత్సవ సమితి తో సమన్వయం చేసుకుంటూ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం వీలైనంత త్వరగా జరిగేలా చూస్తామన్నారు. అలాగే బాలాపూర్ శోభాయాత్ర సాఫీగా సాగేందుకు ఊరేగింపు మార్గం రోడ్ల మరమ్మతులు ఇప్పటికే పూర్తి చేశామన్నారు.. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు నిమజ్జన కార్యక్రమాలు, శోభాయాత్ర ఆటంకాలు లేకుండా సాగేందుకు 30 వేల మంది పోలీసులు, షీటీమ్‌లతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

హుస్సేన్ సాగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణంలో కన్నుల పండువగా జరిగే గణేష్ నిమజ్జన వేడుకలు తిలకించేందుకు రావాలని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పట్టణాలు, పల్లెల్లో కూడా నిమజ్జనం సజావుగా జరిగేందుకు స్థానిక యంత్రాంగాలు కషి చేయాలన్నారు. నగరంలో నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరిగేందుకు నిర్వహకులు, భక్తులు, ప్రజలు, సందర్శకులు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

మహా నిమజ్జనం వేడుకలు ఇన్సిడెంట్ ఫ్రీ గా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి చెప్పారు. నగర వ్యాప్తంగా నిమజ్జన పాయింట్‌ల వద్ద 134 స్టాటిక్ క్రేన్‌లు, 269 మొబైల్ క్రేన్ లు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖలు, విభాగాల సహకారంతో నిమజ్జనం సజావుగా జరిగేలా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్, అధికారులు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. నిమజ్జన పాయింట్లలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా 200 స్విమ్మర్స్ ను అందుబాటులో ఉంచామన్నారు. 15 వేల మంది శానిటేషన్ సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా చేపడుతున్నామని, లేక్ లలో క్లీనింగ్‌ను 24 బై 7 చేపడుతున్నట్టు తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి అన్ని విధాలుగా సర్వసన్నద్ధంగా ఉన్నట్టు మేయర్ తెలిపారు.

## వినాయక నిమజ్జనం.. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

బర్కత్‌పుర- ఆర్టీసీ ఎక్స్ రోడ్డు వద్ద కలుస్తుంది.

దిల్‌సుఖ్‌నగర్ నుండి సైదాబాద్, చాంద్రాయణగుట్ట మీదుగా నల్గొండ ఎక్స్ రోడ్డు వద్ద చేరుతుంది.

టోలీచౌకి, మెహదీపట్నం నుండి మాసబ్ ట్యాంక్, అయోధ్య జంక్షన్, నిరంకారి భవన్ మీదుగా ఎన్‌టిఆర్ మార్గ్ చేరుతుంది.

ఎర్రగడ్డ నుండి ఎస్‌ఆర్ నగర్, అమీర్‌పేట్, ఖైరతాబాద్ మీదుగా మెహదీపట్నం ఊరేగింపులో కలుస్తుంది.

**సాధారణ వాహనాలపై నిషేధం**

ఊరేగింపు మార్గాల్లో వినాయక విగ్రహాల వాహనాలు తప్ప ఇతర వాహనాలకు ప్రవేశం లేదు.ఎన్‌టిఆర్ మార్గ్, పివిఎన్‌ఆర్ మార్గ్, ట్యాంక్ బండ్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్లపై 7వ తేదీ సాయంత్రం వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి.

**పార్కింగ్ స్థలాలు**

భక్తులు వాహనాలను ఈ ప్రదేశాల్లో పార్క్ చేసి నడిచి వెళ్లాలి: ఎన్‌టిఆర్ స్టేడియం, కట్టమైసమ్మ దేవాలయం, లోయర్ ట్యాంక్ బండ్, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధ భవన్ వెనుక, ఆదర్శ్ నగర్ రోడ్, బిఆర్‌కె భవన్, జిహెచ్‌ఎంసి హెడ్ ఆఫీస్ రోడ్, ఖైరతాబాద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, ఎంఎంటిఎస్ స్టేషన్.

భారీ వాహనాలకు కఠిన నిబంధనలు

ఖాళీ లారీలు, ట్రక్కులు నిమజ్జనం తర్వాత మాత్రమే ఎన్‌టిఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్ మీదుగా అనుమతిస్తారు.

# వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు..

- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే..**
- **సిరిసిల్ల మానేరు తీరంలో నిమజ్జన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ..**



**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్లలో శనివారం నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే పలు శాఖల అధికారులు శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక మంటపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జన స్థలం వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు, ఇతర సౌకర్యాల విషయంలో పక్కా ప్రణాళికతో ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వినాయక విగ్రహాలు వచ్చే, వెళ్లే దారిలో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, స్టేజ్, కూర్చునేందుకు కుర్చీలు వేయించాలని, క్రేన్స్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. కళాకారులతో ప్రదర్శన ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ఇక్కడ సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఆయా శాఖల అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం..



- **ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చకినాల శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివి, ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న లేదా పదవీ విరమణ పొందిన దాదాపు 50 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఎన్‌సిసి కమాండర్ గడ్డం నర్సయ్య, రిటైర్డ్ ఎన్‌సిసి ఆఫీసర్ మేజర్ మేకల నారాయణ, మార్గం విశ్వనాథం హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చకినాల శ్రీనివాస్ సభాధ్యక్షత వహించారు.

అతిథులు మాట్లాడుతూ, గత 80 సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిందని ప్రశంసించారు. పాఠశాల పట్టణ నడిబొడ్డున ఉండడం, మంచి సౌకర్యాలు అందుబాటులో ఉండడం వల్ల విద్యార్థులు మెరుగైన విద్యను పొందుతున్నారని వారు తెలిపారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ ప్రొజెక్టర్లు, లైబ్రరీ మరియు సైన్స్ ల్యాబ్ వంటి సౌకర్యాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వారు కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న, పదవీ విరమణ పొందిన 50 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు బైరి రవీందర్, డేవిడ్ సన్, పూర్వ ఉపాధ్యాయులు గుడ్ల రవి, వేముల ప్రతాప్, మరిపల్లి శ్రీనివాస్, ఎనగంటి సురేష్, మ్యాన ఆంజనేయులు, మోర దామోదర్, బూర రమాదేవి, రాజేశం, నిరోష, దేవేందర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం..

- **బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్**

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ పక్షాన నంది కమాన్ చౌరస్తాలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ జీఎస్టీ తగ్గించిన సందర్భంగా మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పేద ప్రజల గురించి దేశ అభ్యున్నతి గురించి ఆలోచించే పార్టీ భారతీయ జనతా పార్టీ అని మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు, జింక అనిల్, ప్రధాన కార్యదర్శి నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు ఎరుగోక్కుల రమేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనే భాస్కర్, సీనియర్ నాయకులు గుండెకర్ల లక్ష్మణ్, చల్ల నర్సయ్య,కార్యదర్శి కొలనూరు సంజీవరెడ్డి, అధికార ప్రతినిధి కర్రె పవన్, బూత్ అధ్యక్షులు పోచంపల్లి భాను, కంసాని రాము, నాయకులు బియ్యాల మధురావు, చొక్కాల ప్రశాంత్, గొడుగు మహేష్, దామోదర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాములు, రమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సాయుధ పోరాట ఉత్సవాలను విజయవంతం చేయాలి

**బలగం టీవీ, కోరుట్ల**

తెలంగాణ రైతు సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈనెల 11 నుంచి గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో ఎర్రజెండాలు ఎగురవేసి, పార్టీ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. “దేశానికి స్వాతంత్ర్యం రాకముందే సీపీఐ అవిర్భవించింది. భూమి కోసం, భుక్తి కోసం, బానిస సంకెళ్ల విముక్తి కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది ప్రాణాలు అర్పించారు. లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, 8,000 గ్రామాలను రజాకార్ల చెర నుండి విముక్తి చేశాం” అని ఆయన గుర్తుచేశారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం తెలంగాణలో విలీనం కావడానికి పార్టీ పోరాటం కీలకమైందని తెలిపారు. “ఈ చరిత్రను బీజేపీ ప్రభుత్వం హిందూ–ముస్లింలుగా వక్రీకరిస్తోంది” అంటూ ఆయన విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం ప్రారంభంలో జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సహాయ కార్యదర్శి ఎరుగురాల భూమేశ్వర్, మాజీ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, ఎర్దండి భూమయ్య, సుతారి రాములు, మహమ్మద్ మౌలానా, ముక్రం, మహమ్మద్ ఉస్మాన్, కొక్కుల శాంత, ఎన్నం రాధ, మాడిశెట్టి కిరణ్, కొండ రాజయ్య, శనిగారపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డ్ గా మారిన సిరిసిల్ల కొత్త బస్టాండ్

- **చెత్తాచెదారంతో సిరిసిల్ల కొత్త బస్టాండ్ నిండి**
- **ప్రజల ఆరోగ్యంపై ప్రభావం..**
- **భరించలేని దుర్వాసన.. చుట్టుపక్కల ఇండ్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు..**
- **పట్టించుకోని మున్సిపల్ అధికారులు..**
- **బస్ డిపో మేనేజర్ వెంటనే బస్ డిపో ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ సాధన చేసుకొని ఇతర ప్రజా అవసరాలకు ఉపయోగించాలి..**
- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం ఇప్పుడు డంపింగ్ యార్డ్‌గా మారిపోయింది. ఈ స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, చనిపోయిన జంతువుల శవాల వల్ల తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. దీని కారణంగా బస్టాండ్‌లో నిలబడటానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ చెత్తాచెదారం వలన దోమలు, ఈగలు పెరిగి చుట్టుపక్కల నివసించే ప్రజలు విష జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నప్పటికీ, బస్ డిపో మేనేజర్, మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. వారికి దీనితో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, తక్షణమే ఈ ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రజలకు ఉపయోగపడే ఇతర అవసరాల కోసం వినియోగించాలని రమేష్ డిమాండ్ చేశారు. లేకపోతే ఈ స్థలం ఇలాగే డంపింగ్ యార్డ్‌గా కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నక్క దేవదాసు తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమి పూజ..

**బలగం టీవీ, బోయినిపల్లి**

బోయినిపల్లి మండలం కొదురుపాక ఆర్ %డ% ఆర్ కాలనీలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి శు క్రవారం రోజున నాయకులు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు భూమి పూజ నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రతిపాదనల మేరకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బతుకమ్మ తెప్ప నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. గతంలోనే ఆర్ అండ్ ఆర్ కాలనీలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి నూతనంగా నిర్మిస్తున్న ఆలయ సమీపంలో 24 గుంటల స్థలాన్ని కేటాయించారు. రాబోయే బతుకమ్మ పండుగ నాటికి మహిళలకు బతుకమ్మ తెప్ప అందుబాటులోకి తీసుక రానున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలగొనీ శ్రీనివాస్, ఓజ్జల మహేందర్, నాగుల నాగరాజు తడిగొప్పుల మురళి, జోగినిపల్లి సత్యనారాయణ, బాలాగోని శ్రీనివాస్, నాగుల వంశీ గౌడ్, కొండల్ రావు, శ్రీనివాస్, మహేందర్, తిరుపతి, శ్రీకాంత్, ప్రశాంత్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు

**బలగం టీవీ, పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దపల్లి రెసిడెన్షియల్ టీచర్స్? ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఉపాధ్యాయులతో కలిసి అమర్‌నగర్ చౌరస్తాలోని సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత స్థానిక సిరి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి విద్యారంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి రెసిడెన్షియల్ టీచర్స్? సంఘం సభ్యులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆసియా కప్ హాకీలో భారత్ శుభారంభం

- చైనా వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ హాకీ టోర్నీ
- తొలి మ్యాచ్‌లో భారత్ 11-0 తేడాతో థాయిలాండ్‌పై విజయం





**బలగం టీవీ, హైదరాబాద్**

చైనా వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం పూల్–%బిలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 11–0 తేడాతో థాయిలాండ్‌ను చిత్తుగా ఓడించింది.

ఏడో నిమిషంలో ముంతాజ్ ఖాన్ తొలి గోల్ సాధించగా, 49వ నిమిషంలో తన రెండో గోల్‌ను నమోదు చేసింది. ఉదిత, బ్యూటీడంగ్ డంగ్‌లు చెరో రెండు గోల్స్ చేయగా, మిగతా ఆటగాళ్లు కూడా ఆకట్టుకున్నారు. ఈ విజయంతో భారత్ తొలి మ్యాచ్‌లోనే అద్భుతమైన ఆరంభాన్ని నమోదు చేసింది. ఈ టోర్నీలో విజేత జట్టు నేరుగా బెల్జియం వేదికగా జరగబోయే మహిళల హాకీ వరల్డ్‌కప్‌కు అర్హత సాధించనుంది.

# యూఎస్ ఓపెన్‌లో యుకీ బాంబ్రీ ఓటమి

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత టెన్నిస్ స్టార్ యుకీ బాంబ్రీ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఆశలు నెరవేరలేదు. యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్‌లో బాంబ్రీ–మైఖేల్ వీనస్ జంట ఓటమి పాలైంది. ఫైనల్ బెర్తు కోసం జరిగిన పోరులో బ్రిటన్ జంట నీల్ స్కుప్స్కీ–జో సలిస్‌బరీ చేతిలో 7–6 (2), 6–7 (5), 4–6 తేడాతో బాంబ్రీ జంట ఓటమి చెందింది. 2 గంటల 53 నిమిషాల పాటు హెూరాహెూరీగా సాగిన మ్యాచ్‌లో చివరికి ప్రత్యర్థి ఆధిక్యాన్ని నిలువరించలేకపోయారు. అంతకుముందు 11వ సీడ్ నికొలా మెక్టిక్%–%రాజీవ్ రామ్ జంటపై అద్భుత విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లి బాంబ్రీ అభిమానుల్లో ఆశలు రేపారు.

మ్యాచ్ అనంతరం బాంబ్రీ మాట్లాడుతూ, "ఈ వారం నాకు ఎంతో ప్రత్యేకం. తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ ఆడటం గర్వకారణం. అయితే ఫైనల్ చేరకపోవడం నిరాశ కలిగించింది. వచ్చే టోర్నీల్లో మెరుగ్గా ఆడేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. జూనియర్ స్థాయిలో (2009) వరల్డ్ నంబర్%–%1గా నిలిచిన బాంబ్రీ, ఓపెన్ ఎరాలో గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ ఆడిన నాలుగో భారత డబుల్స్ ఆటగాడిగా రికార్డు సృష్టించారు. ఇంతకు ముందు లియాండర్ పేస్, మహేశ్ భూపతి, రోహన్ బోపన్న ఈ ఘనత సాధించారు.

# రూ.100కే వన్డే వరల్డ్ కప్ టికెట్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌ల కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు శుభవార్త. ప్రపంచ కప్ విజేతకు ప్రైజ్‌మనీని భారీగా పెంచిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), మ్యాచ్ టికెట్ల ధరను మాత్రం గణనీయంగా తగ్గించింది. భారత్–శ్రీలంక సంయుక్త ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో అభిమానులు కేవలం రూ.100కే మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కలిగింది. వరల్డ్ కప్ సందర్భంగా స్టేడియాలు నిండుగా కనిపించాలన్న ఉద్దేశంతో టికెట్ల ప్రారంభ ధరను రూ.100గా నిర్ణయించినట్టు ఐసీసీ వెల్లడించింది. టికెట్లు tickets.cricketworldcup.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. టికెట్ అమ్మకాలు దశలవారీగా నిర్వహించనుంది. మొదటి దశలో సెప్టెంబర్ 4 నుంచి నాలుగు రోజులపాటు గూగుల్ పే ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. రెండో దశలో సెప్టెంబర్ 9 రాత్రి 8 గంటల నుంచి టికెట్లు అందుబాటులోకి రానున్నాయి. మహిళల వరల్డ్ కప్ చరిత్రలో ఇంత తక్కువ ప్రారంభ ధర ఇదే తొలిసారి.




సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీలో భారత్, శ్రీలంకతో పాటు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు బరిలో నిలవనున్నాయి. మొత్తం ఐదు వేదికలపై మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత్‌లో ఇండోర్, గువాహటి, విశాఖపట్నం, నవీ ముంబై, అలాగే శ్రీలంకలో కొలంబో వేదికలుగా నిర్ణయించారు.

# గురుదక్షిణ చూపిన పాండ్యా బ్రదర్స్

**బలగం టీవీ, హైదరాబాద్**




టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్స్ హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యా తమ చిన్ననాటి కోచ్ జితేంద్ర సింగ్‌కు ఆర్థిక సాయం చేస్తూ గొప్ప మనసు చాటుకున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.80 లక్షల వరకు సహాయం చేసినట్టు జితేంద్ర సింగ్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వెల్లడించారు. హార్దిక్–కృనాల్ సాయం వల్ల తన కుటుంబంలోని ముఖ్యమైన సందర్భాలు సజావుగా జరిగాయని ఆయన గుర్తుచేశారు. 2018లో సోదరి పెళ్లికి, 2024లో రెండో సోదరి వివాహానికి, కారు కొనుగోలుకు సహాయం చేసినట్టు చెప్పారు. అంతేకాక తన తల్లి అనారోగ్య సమయంలో హార్దిక్ తన సంపాదనంతా ఇచ్చేశాడని గుర్తుచేసుకున్నారు. "బైక్‌పై ప్రయాణించవద్దని, భద్రత కోసం కారు బహుమతిగా ఇచ్చారు. ఐపీఎల్ విజయాల తర్వాత కూడా అనేకసార్లు ఆర్థిక సాయం చేశారు. హార్దిక్, కృనాల్ పాండ్యా వంటి శిష్యులు ఉండటం నాకు అదృష్టం" అని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

# ప్యారడైజ్ నుంచి కొత్త స్టిల్

**బలగం టీవీ, హైదరాబాద్**

నేచురల్ స్టార్ నాని 17 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా తన తాజా చిత్రం ది ప్యారడైజ్ నుంచి ఓ కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ఇందులో కండలు తిరిగిన శరీరంతో బీస్ట్ మోడ్‌లో దర్శనమిచ్చారు. ఈ చిత్రంలో నాని జడల్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. రెండు జడలు, గుబురు గడ్డం, మీసాలతో కొద్ది రోజుల క్రితం విడుదలైన నాని లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, తాజా స్టిల్ మరింత ఆసక్తిని పెంచింది. ది ప్యారడైజ్‌ను శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. హైదరాబాద్%–%సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా మార్చి 26, 2026న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. టెక్నికల్ టీమ్‌లో సి.హెచ్. సాయి (కెమెరా), అనిరుధ్ రవిచందర్ (సంగీతం), అవినాష్ కొల్లా (ప్రొడక్షన్ డిజైన్) ఉన్నారు. రచన–దర్శకత్వం శ్రీకాంత్ ఓదెలదే.



# మన శంకర వరప్రసాద్‌గారు కేరళ షెడ్యూల్ పూర్తి

**బలగం టీవీ, హైదరాబాద్**




అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా వస్తున్న చిత్రం మన శంకర వరప్రసాద్‌గారు చిత్రీకరణ వేగంగా సాగుతోంది. నయనతార హీరోయిన్‌గా, వెంకటేశ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. చిత్రబృందం తాజాగా కీలక అప్‌డేట్‌ను షేర్ చేసింది. కేరళ షెడ్యూల్‌ను పూర్తి చేసిన యూనిట్, కొత్త షెడ్యూల్‌ను సెప్టెంబర్ 5న ప్రారంభించింది. ఈ షెడ్యూల్ సెప్టెంబర్ 19 వరకు కొనసాగనుంది. ఇందులో రెండు పాటలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. అక్టోబర్‌లో జరగబోయే షెడ్యూల్‌లో వెంకటేశ్ జాయిన్ కానున్నారని మేకర్స్ ప్రకటించారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తుండగా, షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు.




# 'కిష్కిందపురి'కి సెన్సార్ క్లియర్

**బలగం టీవీ, హైదరాబాద్**

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన కిష్కిందపురి విడుదలకు సిద్ధమైంది. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహించగా, సాహు గారపాటి (షైన్ స్క్రీన్స్) నిర్మించారు. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఎటువంటి కట్స్ లేకుండా సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్‌ను జారీ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. ట్రైలర్, టీజర్లు ఇప్పటికే ఆసక్తి రేపిన ఈ సినిమాపై హైప్ పెరుగుతోంది. అయితే, పిల్లలకు అనుమతి లేదని, గుండె బలహీనత కలిగిన వారు ఈ సినిమాకు దూరంగా ఉండాలని మేకర్స్ విజ్ఞప్తి చేశారు.



# తెలుగులోకి రానున్న 'వీర చంద్రహాస'

- 19న ప్రేక్షకుల ముందుకు

**బలగం టీవీ, హైదరాబాద్**

కన్నడ అగ్ర హీరో శివరాజ్‌కుమార్ కీలక పాత్రలో నటించిన వీర చంద్రహాస కన్నడలో భారీ విజయాన్ని అందుకుంది. ఈ చిత్రంతో 'కేజీఎఫ్' సంగీత దర్శకుడు రవి బస్రూర్ దర్శకుడిగా మారారు. హెూంబలే ఫిల్మ్స్ సమర్పణలో, ఓంకార్ మూవీస్ పతాకంపై ఎస్.ఎస్.రాజ్‌కుమార్ నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగులో ఎంవీ రాధాకృష్ణ (కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్) విడుదల చేస్తున్నారు. సినిమా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మహాభారతంలోని అశ్వమేధిక పర్వం నేపథ్యంలో సాగే ఈ కథ, యక్షగాన ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులకు వినూత్నమైన సినిమాటిక్ అనుభూతి ఇవ్వనుందని మేకర్స్ చెబుతున్నారు. 'మహావతార్ నరసింహ' తర్వాత హెూంబలే సమర్పిస్తున్న ఈ సినిమా కూడా అదే స్థాయి విజయాన్ని అందుకుంటుందని రాధాకృష్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో శిథిల్‌శెట్టి, నాగశ్రీ జి.ఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి, ఉదయ్ కడబాల్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సినిమాటోగ్రఫీ: కిరణ్‌కుమార్ ఆర్.